క్లుప్తంగా

కొత్త అడ్మిషన్లకు ఫీజుల్లో 30 శాతం రాయితీ

తెనాలిఅర్బన్: మాంటిస్సోరి స్కూల్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు అయిన నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం నూతనంగా పాఠశాలలో చేరే విద్యార్థులకు 30 శాతం మెరిట్ స్కాలర్‌షిప్‌ను ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మోర్లే ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విద్యార్థుల సోదరుడు, సోదరీమణులకు ఫీజులో కొంత రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలన్నారు.

నేడు ఊపిరితిత్తుల సమస్యలపై ఉచిత వైద్యశిబిరం

తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని శ్రీచక్ర సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ మూడో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల్నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే వైద్యశిబిరంలో ఊపిరితిత్తులు, శ్వాసకోశ నిపుణుడు డాక్టర్ కొండా మిథునేశ్వర్‌రెడ్డి వైద్యపరీక్షలు చేస్తారని నిర్వాహకులు తెలియజేశారు. ఆస్తమా, సీఓపీడీ, బ్రాంకైటిస్, ఓయ, కోవిడ్ తర్వాత వచ్చే ఊపిరితిత్తుల సమస్యలు, ఛాతీలో గాలి చేరడం, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు, న్యూమోనియా వంటి సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తారని వివరించారు.అవసరమైనవారికి ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష, షుగరు పరీక్షలు ఉచితంగా చేస్తారని, ఆసక్తిగలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



తెనాలిఅర్బన్: అక్కిశెట్టి బాబురావు, అక్కిశెట్టి ఆదిలక్ష్మిల వర్ధంతులను పురస్కరించుకుని బోసురోడ్డులోని అన్నదాత సుఖీభవ చలివేంద్రంలో మంగళవారం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడిబోయిన హరిప్రసాద్, మహ్మద్ ఖుద్దూస్, నాగళ్ళ కోటేశ్వరరావు, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, కన్నెగంటి గోపిచంద్, వెనిగళ్ళ నారాయణ శివప్రసాద్, కుదరవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగుతో లాభాలు




కొల్లిపర: ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రతి రైతు కొంత పంట భూముల్లో నవధాన్యాల సాగు చేయటం వలన లాభాలతో పాటు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని ఐసీఆర్‌పీ ఝాన్సీ రోజా అన్నారు. మంగళవారం కొల్లిపర గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఖరీఫ్ యాక్షన్ ప్రణాళిక నవధాన్యాల సాగు విధానంపై ఎస్‌హెచ్‌జీ సభ్యు లుకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం వల్ల కలిగే లాభాలు ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, గోపి, కోటేశ్వరరావు, ఓబులయ్య, సునీల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 40 మంది ఎంపిక



తెనాలిఅర్బన్: దివీస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో మంగళవారం బుర్రిపాలెం రోడ్డు లోని ఎన్.ఆర్.కె. అండ్ కె.ఎస్.ఆర్.గుప్తా కాలేజ్ ఆఫ్ ఫార్మశీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ దుర్గారావు తెలిపారు. విద్యార్థులను రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ద్వారా ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుప్తా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీ.విజయకృష్ణ, పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజర్ డి.శ్రీనివాసరావు, కమ్యూనిటీ సభ్యులు నంబూరు నరేంద్ర, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో నెహ్రూనికేతన్ విద్యార్థులకు ర్యాంకులు



తెనాలిఅర్బన్: జాతీయ, రాష్ట్రస్థాయిలో పలు ప్రముఖ సంస్థలు నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షల్లో నెహ్రూనికేతన్ స్కూల్‌కు చెందిన 78 మంది విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు లభించాయని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. వీరిని పాఠశాల ఆవరణలో మంగళవారం అభినందించి సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


పరుగులు తీస్తున్న శ్రీసాయి ఆర్ట్స్ 'జనరల్ బోగీలు'

- ఆరు పరిషత్తుల్లో 20 బహుమతులు
- వరుస పరిషత్ పోటీల్లో 'విజయ్' పరంపర
- ఉత్తమ నటిగా సురభి ప్రభావతి

శ్రీసాయి ఆర్ట్స్ కళాకారులు పాత్రల్లో నటించరండీ.... అందులో జీవిస్తారు! ఇది ఓ సామాన్య ప్రేక్షకుడి మాట. అందుకేనేమో! వారి 'జనరల్ బోగీలు' ఏ పరిషత్తుకి వచ్చినా జనం చొరబడి వచ్చేస్తున్నారు. అందులో కనిపించే పాత్రల్లో తమని తాము చూసుకుంటున్నారు. తాము పడ్డ కష్టాన్నీ గుర్తు తెచ్చుకుంటున్నారు. చివరకు ఆ పాత్రల్లోకి ఒదిగిపోయి వేదికపై జీవించి రంజింపచేసిన కళాకారులను చప్పట్లతో అభినందిస్తున్నారు. ఇదీ ఓ జనరల్ బోగీల కళాకారుల కథ.



సురభి ప్రభావతి



గోపరాజు విజయ్

తెనాలి: రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన ప్రముఖ నాటకసంస్థ శ్రీసాయి ఆర్ట్స్ 'జనరల్ బోగీలు' సాంఘిక నాటిక, రాష్ట్ర, జాతీయ స్థాయి పరిషత్ పోటీల్లో బహుమతులను కొల్లగొడుతోంది. కేవలం ఏప్రిల్ నెలలోనే ఇప్పటివరకు ఆడిన ఆరు పరిషత్తుల్లో పాల్గొనగా ప్రతి చోటా మూడు నుంచి నాలుగు బహుమతులు చొప్పున మొత్తం 20 బహుమతులను కైవసం చేసుకోవటం విశేషం! ప్రధాన పాత్ర పోషించిన రంగస్థల, సినీనటి సురభి ప్రభావతి ఒకటి మినహా అయిదు పరిషత్తుల్లో ఉత్తమ నటిగా ఎంపికవటం మరో ప్రత్యేకత! జనరల్ బోగీలు నాటిక కథాంశం అందరికీ తెలిసిందే అయినా... ఇప్పటివరకు నాటక రచయితలు ఎవరూ పట్టించుకోనిది. రైళ్లలో జనరల్ బోగీలదే ఈ నాటిక ఇతివృత్తం. ఓడ ఎక్కనివారు, విమానంలో ప్రయాణించనివారు ఉండొచ్చుగానీ రైలు ఎక్కని ప్రయాణీకులు దాదాపు ఉండరు. సామాన్య, మధ్యతరగతి పౌరులు దూరప్రాంతాలకు వెళ్లాలంటే చౌకగా గమ్యస్థానానికి చేరటానికి రైలునే ఎంచుకుంటారు. కారణం ఏదైనా ఇటీవలకాలంలో రైళ్లలో జనరల్ బోగీలు తగ్గించేశారు. దీంతో ఆ బోగీలు కిక్కిరిసి ఉంటున్నాయి. సీట్లపైనే కాదు, బెర్త్‌లమధ్య నడక దారిలోనూ కూర్చొని ఏదోలా గమ్యానికి చేరాలనే ఆత్రుత పడేవారిని చూస్తుంటాం. రిజర్వుడు బోగీల్లోని ప్రయాణీకుల్లా జనరల్ బోగీల్లోని వారి వివరాలు రైల్వేశాఖ దగ్గర ఉండవు. అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే మృతుల గుర్తింపు, పరిహారం పొందటానికి అవకాశాలు తక్కువ. అలాంటి జనరల్ బోగీలో ప్రయాణించిన కొడుకు జాడ తెలియని సావిత్రమ్మ అనే మహిళ, రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలనీ ప్రయాణీకుల వివరాలు కచ్చితంగా ఉండాలంటూ ఉద్యమిస్తుంది. ఆ ఉద్యమం, పర్యవసనాలే 'జనరల్ బోగీలు' నాటిక. సామాన్య ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణించేలా తగినన్ని బోగీలు ఉండాలని, ప్రమాదం జరిగి ప్రాణనష్టం కలిగితే, పరిహారం పొందటానికి వీలుగా వారి వివరాలను రైల్వేశాఖ తీసుకోవాలనేది ఇందులో చర్చించారు. విశాఖపట్నానికి చెందిన పీటీ మాధవ్ రచించారు. శ్రీసాయి ఆర్ట్స్‌కు చెందిన రంగస్థల, సినీ నటుడు గోపరాజు విజయ్ దర్శకత్వంలో జనవరి నుంచి ఇప్పటివరకు 21 ప్రదర్శనలిచ్చారు.



'జనరల్ బోగీలు' నాటికలో సన్నివేశం

ఇందులో ప్రతినాయకుడిగానూ విజయ్ నటించారు. 'మిడిల్‌క్లాల్ మెలోడీస్' నుంచి అలుపులేకుండా సినిమాలు చేస్తున్న శ్రీసాయి ఆర్ట్స్ నటీమణి సురభి ప్రభావతి ఈ నాటికలో సావిత్రమ్మ పాత్రను అద్భుతంగా పోషిస్తున్నారు. తన నటనా ప్రతిభకు గుర్తింపుగా దాదాపు ప్రతి ప్రదర్శనలోనూ ఉత్తమ నటి బహుమతిని అందుకుంటున్నారు.

గుడివాడలో ఈనెల 18,19,20 తేదీల్లో జరిగిన కృష్ణా ఆర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ పోటీల్లో 'జనరల్ బోగీలు' నాటిక ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ రచన, ఉత్తమ నటి, ఉత్తమ ప్రతినాయకుడు బహుమతులను గెలుచుకుంది. ఇవే తేదీల్లో వరగానిలో జరిగిన లావు వెంకటేశ్వర్లు, కల్లూరు నాగేశ్వరరావు కళాపరిషత్ పోటీల్లో ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ ప్రతినాయకుడు, ఉత్తమ ఆహార్యం బహుమతులు లభించాయి. బీవీఆర్ కళాపరిషత్, తాడేపల్లి గూడెం పరిషత్ పోటీల్లో ద్వితీయ ఉత్తమ ప్రదర్శనతోపాటు ఉత్తమ నటి, ఉత్తమ సంగీతం బహుమతులను స్వీకరించారు. సీఆర్‌సీ కాటన్ కళాపరిషత్, రావులపాలెం పోటీల్లో ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ రచన బహుమతులను అందుకున్నారు. పుచ్చపల్లి సుందరయ్య కళానిలయం, యడ్లపాడు, కొండవీటి కళాపరిషత్, లింగారావుపాలెం పోటీల్లో తృతీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఇలా నాటక రంగస్థల జైత్రయాత్రను కొనసాగిస్తోంది.

గతంలో శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సమాజం ప్రదర్శించిన 'శ్రీకారం' (108 ప్రదర్శనలు), 'బైపాస్' (50), 'ఒక్క మాట చాలు' (70), 'పెళ్లి చేసి చూడు' (30), 'తలుపులు తెరిచే ఉన్నాయి' (67), 'గమ్యస్థానాల వైపు' (50) నాటికలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రదర్శించారు. బైపాస్ నాటికకు బంగారు నంది వరించింది. అనేక పరిషత్ బహుమతులను పొందారు. ఆ క్రమంలోనే ఇప్పుడు తమ నాటక ప్రయాణాన్ని 'జనరల్ బోగీల'తో కొనసాగిస్తూ బహుమతులను అందుకుంటున్నారు.

అగ్నిప్రమాదాల అప్రమత్తతపై అవగాహన



తెనాలి: అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని వెస్ట్‌బెర్రీ పాఠశాలలో ఫైర్ సేఫ్టీ డ్రిల్‌ను నిర్వహించారు. అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రాణాలను రక్షించడానికి చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదం సంభవించినపుడు నివారణ పరికరాలను ఉపయోగించటం, భయాందోళన లేకుండా ఎలా స్పందించాలి అనే అంశాలను ప్రాక్టికల్ డెమో తెలియజేశారు. ప్రమాద సమయంలో ఇవ్వాల్సిన ప్రాథమిక చికిత్స, అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయటాన్ని ప్రత్యక్షంగా చూపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిక్సీ రిపేరు విషయమై దాడి

తెనాలిరూరల్: మిక్సీ రిపేరు విషయంలో మెకానిక్ ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చాడు. పోలీసుల కథనం ప్రకారం... పట్టణానికి చెందిన కొమ్మూరు రవిశంకర్ నాజరుపేటలో మిక్సీని రిపేరుకు ఇచ్చాడు. రిపేరు చేయడం ఆలస్యమవడంతో ప్రశ్నించగా మెకానిక్ శ్రీనివాసరావు అతనిపై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్

తెనాలిటౌన్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించవలసిన పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి.చిరంజీవిని కలిసి విద్యుత్‌కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మేన్‌లకు సంవత్సరానికి 8 పెయిడ్ హాలీడేస్ ఉన్నాయని, ఆ పని దినాల్లో అదనంగా పనిచేసిన వారికి వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వేలకోట్ల రూపాయిలు టర్న్ చేసే కంపెనీ చిన్నమొత్తాలను చెల్లించడంలో నిర్లక్ష్యం కనబరచడాన్ని తప్పుబట్టారు. తక్షణం నిధులు విడుదల చేసి కార్మికులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు, కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ కార్యదర్శి ఎస్.నాగరాజు, గోపినాథ్, సాంబశివరావు, దాసరి గోపి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



ఈఈ చిరంజీవికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నేతలు

సాంఘిక బహిష్కరణపై చర్యలు తీసుకోవాలి

ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్

తెనాలిఅర్బన్: పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో ఎస్సీలను సాంఘిక బహిష్కరణ చేసిన వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు దాటిన ఇంకా దళితులను అగ్రవర్ణాలవారు చిన్నచూపు చూస్తునే ఉన్నారని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలో ఇంత దారుణం జరిగిన ప్రభుత్వ స్పందించకపోవడం బాధకరమన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని ఖండించాలని కోరారు. అలాగే విద్యుత్‌ఘాతంతో చనిపోయిన కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు కుటుంబంలో ఒకరికీ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులపై ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనిల్, ఐక్యవేదిక నాయకులు కనపర్తి సతీష్ కుమార్, తుమ్మల తులసీ, ఉన్నవ రాజేష్, నల్లగండ్ల రవిచంద్ర, పెరికల అరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐక్యవేదిక అధ్యక్షుడు కిరణ్

పీఎం శ్రీ పథకం పనులు పరిశీలన

అమర్తలూరు(వేమూరు): ప్రధానమంత్రి శ్రీ పథకం ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని సమగ్ర శిక్ష అధికారి ఏపీసీ నాగిరెడ్డి తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి శ్రీ పథకం ద్వారా కొన్ని పాఠశాలలు అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అమర్తలూరు మండలంలోని అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణం, ర్యాంపుల నిర్మాణం, ఆట స్థలంలో కోర్టుల పనులు జరుగుతున్నాయన్నారు. పనుల నాణ్యతను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పీఎం శ్రీ పథకం పనుల్లో నాణ్యత లోపిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కనపాల రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఇంజనీరు పవన్ పాల్గొన్నారు.



పీఎం శ్రీ పథకం పనులను పరిశీలించిన సమగ్ర శిక్ష అధికారి నాగిరెడ్డి

మహిళలకు మొబైల్ యాప్‌పై అవగాహన

మంగళగిరి టౌన్: మహిళా సంఘాలు త్వరితగతిన మెరుగైన సేవలు తెలుసుకోవడానికి ప్రభుత్వం మహిళాకాశం అనే మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నదని మంగళగిరి మెప్మా సి.ఎం.ఎం మాలతి అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆర్‌పీలకు మహిళాకాశం మొబైల్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ యాప్ టెస్టింగ్‌లో ఉందని.. ఆర్‌పీలు వారి అభిప్రాయాలను అందులో పొందుపరచి ఏమైనా యాప్‌లో సమస్యలు ఉన్నట్లు గుర్తించి తెలియజేస్తే యాప్‌ను మరింత అభివృద్ధి చేసి రానున్న నాలుగైదు రోజుల్లో అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, తీసుకున్న నిర్ణయాలు, నిర్వహించిన కార్యక్రమాలు నమోదు చేయవచ్చని తెలిపారు. క్షేత్ర స్థాయిలో మహిళా సంఘాల పర్యవేక్షణ సులభతరం అయ్యేందుకు ఈ యాప్ ఎంతగానో దోహదపడుతుందని, దానిపై ఆర్‌పీలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఓలు జ్యోతి, సుధాకర్, మంగళగిరి పట్టణ, రూరల్ మండలాల ఆర్‌పీలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌పీలు

హోం కంపోస్ట్ తయారీపై అవగాహన

మంగళగిరి టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని.. అందులో భాగంగా నిత్యం ఇంట్లో ఉత్పత్తి అవుతున్న తడి, పొడి చెత్తలను వేరుచేసి హోం కంపోస్ట్‌ను తయారు చేయడం అలవర్చుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల అన్నారు. ఎంటీఎంసీ కార్యాలయంలో మంగళవారం మంగళగిరి పట్టణ, మండల పరిధిలోని రిసోర్స్‌పర్సన్ (ఆర్‌పీలు)లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంట్లోని వ్యర్థాలను సేకరించి తడి చెత్తతో కంపోస్ట్ ఎరువులను తయారు చేసుకోవచ్చని అన్నారు. ఇంట్లో వెలువడే చెత్తను తడిచెత్త, పొడిచెత్తలను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. వంటగదిలోని వ్యర్థాలతో ఎరువును తయారుచేసి ఇంట్లో మొక్కలకు ఉపయోగించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సి.ఎం.ఎం మాలతి, సీఓలు జ్యోతి, సుధాకర్, ఆర్‌పీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చెఫ్ మృతి

తెనాలిరూరల్: తోటి చెఫ్ బీరు సీసాతో చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన చెఫ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులోని హోటల్‌లో చెఫ్‌లుగా పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దాటాక మద్యం తాగి ఘర్షణ పడడం, ఓ చెఫ్ మరో చెఫ్‌పై బీరు సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంగతి తెలిసిందే విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విజయనగరంకు చెందిన భాస్కర్ (32) మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందింది.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని బార్ అసోసియేషన్ హాలులో ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించబడునని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.గిరిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యుడు ప్రభాకర్ రావు జ్ఞాపకార్థం నిర్వహించే వైద్య శిబిరాన్ని న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వైద్య పరీక్షలు అనంతరం అవసరమైన వారికి 50 శాతం రాయితీతో కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించబడునని అన్నారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహనాన్ని తప్పించబోయి కాలువలో పడ్డ బస్సు



చెరుకుపల్లి: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన బోది కాలువలోకి బస్సు దూసుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం తెనాలి నుంచి నగరం వెళుతున్న ఆర్టీసీ బస్సు చెరుకుపల్లి శివారు ప్రాంతం గ్యాస్ గోడౌన్ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి వెళ్లి పడిపోయింది. ఆ సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు ఎనిమిది మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే బస్సులో ఉన్న ప్రయాణికులకు ఏమీ కాకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే దగ్గరలోని క్రేన్ సాయంతో బస్సును బయటకు తీశారు.

సేవానిరతి కలిగి ఉండాలి

గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి

తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ సేవానిరతిని కలిగి ఉండాలని గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి పిలుపునిచ్చారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో మంగళవారం కన్నెగంటి వీరంబశ్రీ హృదయసాయి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్నెగంటి రమేష్‌బాబు, శిరీష, కన్నెగంటి గోపిచంద్, పార్వతమ్మ, మదాల కోటేశ్వరరావు, విష్ణుశెట్టి మాధవరావు, వెనిగళ్ళ ప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, మణికుమార్, వెంకటస్వామి, ఉమాదేవి, భానుమూర్తి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

తెనాలిరూరల్: అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10, 12 తరగతుల విద్యార్థులు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒకేషనల్ ట్రైనింగ్‌లో భాగంగా గత 12 రోజులుగా బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, అపారెల్ మేడ్ అప్స్ కోర్సులు, ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంను మంగళవారం పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకింగ్ రంగ సంస్థలు అందించే వివిధ సేవలు, ఆర్థిక లావాదేవీలు, అపారెల్ మేడ్ అప్స్ కోర్సులో ఫ్యాషన్ డిజైనింగ్, ఎంబ్రాయిడరీలో 35 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. ఇంటర్న్‌షిప్‌లో శిక్షణ తీసుకున్న ప్రతి విద్యార్థికి పాఠశాలలో పాఠశాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయురాలు ఎన్. అనురాధ ద్వారా సర్టిఫికెట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఇటువంటి శిక్షణలు తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, ఆర్థిక నైపుణ్యాలు పెంపొందడంతో పాటు భవిష్యత్‌లో వారు ఉపాధి అవకాశాలు కల్పించుకోవడానికి ఉపయోగపడతాయని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఒకేషనల్ ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వరమ్మ, ఇ.బాబు అమర్నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉపాధి హామీ బకాయిల విడుదలకు డిమాండ్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్

తెనాలి: రూరల్ మండల గ్రామం గుడివాడలో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో చేసిన ఉపాధి హామీ పనులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డితో కలిసి మంగళవారం గుడివాడలోని ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కార్మికులు మాట్లాడుతూ, ఫిబ్రవరి, మార్చి నెలల్లో చేసిన పనులకు ఇప్పటికీ వేతనాలు ఇవ్వలేదని తామెలా బతకాలంటూ ప్రశ్నించారు. అలాగే కనీస వేతనం రూ.307 కాకుండా కేవలం రూ.250లకు మాత్రమే బిల్లు వస్తోందని తెలిపారు. అలాగే గతంలో మంచినీళ్లకు డబ్బులు చెల్లించే వారని, పలుగు, పారకు సానపట్టేందుకు డబ్బులు చెల్లించే వారనీ చెబుతూ ప్రస్తుతం ఆ డబ్బులు ఇవ్వటం లేదన్నారు. అలాగే ఉపాధి పనులకు అయిదు కిలోమీటర్లు దూరం వెళితే ఆటోలకు చార్జీలు కూడా ఇవ్వటం లేదని వాపోయారు. ఎండలు తీవ్రంగా ఉన్నా, సమ్మర్ అలవెన్స్ కూడా ఇవ్వడం లేదన్నారు.

ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు తగ్గించిందని, అలాగే ఉపాధి హామీ ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఉపాధి పనిపై కూలీలకు విరక్తి కలిగేలా రెండు పూటల మచ్చరు వేయటం, మౌలిక వసతులు కల్పించకపోవడంతోపాటు వేతనాలను సకాలంలో ఇవ్వటం లేదన్నారు. ఇవ్వకపోవటం చేస్తున్నారని విమర్శించారు. ఫిబ్రవరి నెలలో చేసిన పనికి ఇంతవరకు బిల్లు రాకపోతే కూలీలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు.



గుడివాడలో ఉపాధి కూలీలతో అప్పారావు

మున్సిపల్ కార్మికుల దీక్షకు స్పందన

రేపల్లె రూరల్: సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు మున్సిపల్ అధికారులు స్పందించారు. ఉదయం కార్యాలయం ముందు ప్రత్యేక టెంట్లు వేసి సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్మికులు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు దీక్షాశిబిరాన్ని సందర్శించి కార్మికులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ బాలాజీ మాట్లాడుతూ కార్మికుల ఐక్యతకు నిదర్శనంగా అధికారులు స్పందించారన్నారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంతో పాటు కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారన్నారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగాంజనేయులు, జైభీమ్ భారత్ పార్టీ నాయకులు దోవ రమేష్‌రాంజీ, మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు శ్రీనివాసరావు, శివశంకర్, ఎం.దుర్గారావు, కె.వెంకటరమణ, ఏసుబాబు, రాజ్యలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెంలో ప్రభుత్వ బడి బాట ప్రచారం

చుండూరు(వేమూరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నమోదు సంఖ్య పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాఠశాల ఉపాధ్యాయులు బట్టు వెంకయ్య అన్నారు. చుండూరు మండలంలోని వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వం బడి బాట ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మకు వందనం కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని నాణ్యతతో సరఫరా చేయాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ బడి బాట ప్రచారం బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నిర్వహించడం జరిగిందని చెప్పారు. గ్రామస్తులు పాల్గొన్నారు.